క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో ఆకేపాటి



శ్రీవారిని దర్శించుకుని వస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తిరుమలలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం అఖిలాండం వద్ద కాయా కర్పూరం సమర్పించుకున్నారు. కాగా ఆకేపాటి అన్నమయ్య కాలిబాటలో వచ్చేనెల 06న 22వ తిరుమల మహాపాదయాత్రను చేపట్టనున్న సంగతి తెలిసిందే.

రేపు శివ, కేశవుల కల్యాణం

రాజంపేట టౌన్ : పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 8:30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు ప్రముఖ పురోహితులు శశిధర్ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటల నుంచి అన్నమయ్య సంకీర్తనలు, 6:30 గంటలకు ఎదుర్కోళ్ల కార్యక్రమాలు ఉంటాయన్నారు. కాగా స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు



పూజలు చేస్తున్న వేదపండితులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని ఎర్రచందనం పార్కులో బ్రాహ్మణ సంఘం, శంకరమఠం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన భోజనాలు నిర్వహించారు. వేదపండితుల పరమేశ్వరుడు, ఆదిశంకరాచార్యుల వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రామ్మోహన్‌శర్మ మాట్లాడుతూ ప్రతి ఏటా బ్రాహ్మణ సమాజం సమాజహిత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే ఈనెల 30 సాయంత్రం శంకరమఠంలో కార్తీక దీపోత్సవం నిర్వహిచనున్నట్లు తెలిపారు. అనంతరం సమూహిక వన భోజనాలు చేశారు.

వీరభద్రస్వామి ఆలయ సిబ్బంది సహపంక్తి భోజనం



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న వీరభద్రస్వామి ఆలయ అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే కార్తిక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఓదివీడు గ్రామం మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ శివరామాంజనేయ స్వామి ఆలయ సముదాయంలో ఉన్న ఉసిరి చెట్టుకు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది కలసి తారతమ్యాలు మరిచి ఒకే చోట చేరి వివిధ రకాల వంటకాలు వండి పంక్తి భోజనం చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడి ఎన్నిక



దివీన్‌కుమార్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు రమణ ఆధ్వర్యంలో మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక జరిగింది. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడిగా దివీన్‌కుమార్, కార్యదర్శిగా లతీఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రతి ఒక్కరూ సంఘటితంగా పోరాడాలని తెలిపారు.

గర్భాశయ క్యాన్సర్ నివారణే ప్రధాన లక్ష్యం

కేవీపల్లె: గర్భాశయ క్యాన్సర్ నివారణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నకమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 173 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో 35 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ డాక్టర్ పి.వి.బ్రహ్మారెడ్డి, ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీం, వలంటీర్లు షబ్బీర్, బాషా, తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గతితప్పిన గ్రామీణ రోడ్లు

- ప్రయాణం చేయలేక వాహనదారుల ఇబ్బందులు
- రోడ్లు వేయాలని విన్నవించినా పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం



చిన్నబిడికి రహదారిపై మడుగును తలపిస్తున్న వర్షపునీరు

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో లింకు రోడ్లు, తారు రోడ్లపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా రోడ్ల పరిస్థితి ఇలా.. దేవపట్ల నుంచి వంకవారిపల్లె, దిగువ రాజువారిపల్లె, హరిజనవాడ మీదుగా చిన్నబిడికి వరకు, శెట్టిపల్లె కస్పా నుంచి సరిపిరాళ్లపల్లె మీదుగా యర్రమోరంపల్లె, శెట్టిపల్లె నుంచి దుద్యాల కోటకాడపల్లె లింకు రోడ్డు వరకు నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. వర్షం కురిసినప్పుడు రహదారులు పూర్తిగా తారు లేచిపోయి గుంతలు ఏర్పడి నీళ్లు నిలబడ్డాయి. ఫలితంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు మలుమార్లు అదుపుతప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలింతలు, గర్భిణులు, వైద్యశాలలకు ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టకోవాల్సిన దుస్థితి వచ్చిందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి కిలోమీటర్‌కు అర కిలోమీటర్ తారు రోడ్డుపై కంకర లేచి గుంతలు ఉండటంతో బస్సులు, ఆటోలలో ప్రయాణిస్తున్న ప్రజలు ఒళ్లు గుల్ల చేసుకొంటున్నారు. పలుమార్లు తారు రోడ్డుల మరమ్మతులపై అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వర్షం నీరు నిల్వడంతో ప్రమాదకరంగా తయారైన రౌతుకుంట రోడ్డు



కుంటకిందపల్లెలో రోడ్డుపై నిల్వ ఉన్న నీరు

విధుల నిర్వహణలో అధికారుల అలసత్వం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకుడు అంకన్న

రాయచోటి అర్బన్ : విధుల నిర్వహణలో వసతి గృహ సంక్షేమాధికారుల అలసత్వం తగదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డైట్ పాఠశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాల్లోని వసతిగృహ సంక్షేమాధికారులకు బుధవారం సెలవు దినమైనప్పటికీ వారు ఆదివారం కూడా విధులకు హాజరుకాకుండా దుమ్మా కొడుతుండం దారుణమన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా బోగస్ అటెండెన్స్ వేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ విషయమై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు సైతం ముడుపులు పుచ్చుకుంటూ వసతిగృహ సంక్షేమాధికారుల పనితీరును పెద్దగా పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోతే తాము జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు హర్షవర్ధన్, జాహిద్, సాయి, నాయక్ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీ చెన్నకేశవుడి కల్యాణం



కల్యాణ క్రతువును జరిపిస్తున్న వేదపండితులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి గ్రామం దేవలంపల్లిలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు, కమిటీ సభ్యులు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుర్నూతుల, పిందిళ్ల, కస్తూరిరాజుగారిపల్లి, లక్కిరెడ్డిపల్లి, మద్దిరేవుల, కాకులవరం తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వెంటనారాయణ శాస్త్రి సమక్షంలో జరిగిన కల్యాణోత్సవం కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ కేఆర్‌టీఎల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ఉర్దూ లెక్చరర్ పీఎస్‌జీ అసదుల్లా బాషా బహుమతులను అందజేశారు.

విజేతల వివరాలు

వ్యాసరచన పోటీ: రాజ్యాంగ ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహించబడిన పోటీలలో వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా మహిళా విజేత కె.హసిత(జెడ్పీజీహెచ్‌ఎస్, రాయచోటి), పురుష విజేత కె.దీపక్ (ఏపీఎంఎస్, రాయచోటి),

వక్తృత్వ పోటీలు: రాజ్యాంగ హక్కులు - విధులు అనే అంశంపై నిర్వహించిన పోటీలలో మహిళా విజేత ఎం.భవ్య, పురుష విజేత కేఎండీ అనస్ నిలిచారు.

డిబేట్: రాజ్యాంగ సవరణలు - అవసరాలకే పరిమితం కావాలా? అనే అంశంపై విద్యార్థులు సునిశితమైన చర్చలు జరిపారు. మహిళా విజేత జి.జాహ్నవి, పురుష విజేత బి.గంగాధర

క్విజ్ పోటీ: భారత రాజ్యాంగం - దాని నిర్మాణకర్తలు అనే అంశంపై నిర్వహించిన క్విజ్‌లో విద్యార్థులు తమ రాజ్యాంగ జ్ఞానాన్ని ప్రదర్శించారు. మహిళా విజేత ఎస్.సరియా ఫాతిమా, పురుష విజేత ఎం.అరుణ్‌కుమార్‌నాయక్‌లు గెలుపొందారు. ఈ విజేతలు సోమవారం జోనల్ లెవెల్ కాంపిటీషన్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. జోనల్ లెవెల్ కాంపిటీషన్ కడపలోని సీఎస్‌ఐ హైస్కూల్‌లో నిర్వహించబడునని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో అధ్యాపకులు వైసీ రెడ్డప్ప రెడ్డి, రెడ్డయ్య, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

శాంతి, సమాధానాలతో జీవించాలి



వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ కస్తూరి విశ్వప్రసాద్



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

రాజంపేట టౌన్ : క్రైస్తవులు, విశ్వాసులకు అతి ముఖ్యమైన పండుగ క్రిస్మస్. క్రీస్తు జననానికి చిహ్నంగా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రిస్మస్ డిసెంబర్ 25న అయినప్పటికి వివిధ పేర్లతో నెల రోజుల ముందు నుంచి క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభమవుతాయి. అందులో భాగంగా మండలంలో పలు చర్చిల్లో ఆదివారం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా చర్చిల పాస్టర్లు క్రైస్తవులకు, విశ్వాసులకు వాక్యోపదేశం చేశారు. క్రీస్తు జననం మానవాళికి పర్వదినమని, మరో నెల రోజుల్లో ఆ పర్వదినం రాబోతుందన్నారు. ఆ ఆనందభరితమైన ఘడియకు సమయం ఆసన్నమైనందున ఏసు నామముతో నెల రోజులపాటు జరుపుకునే ప్రత్యేక ప్రార్థనల్లో విశ్వాసులంతా తప్పక పాల్గొనాలని సూచించారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించినప్పుడే సన్మార్గం వైపు పయనించగలమన్నారు. ఈ లోకానికి వెలుగునిచ్చేందుకు వచ్చాడని, ఆయన వెంట నడిచిన వారంతా జీవపు వెలుగులు కలిగివుంటారని తెలిపారు. ప్రభువు పట్ల విశ్వాసం ఉంచిన వారు శాంతి, సమాధాన సంతోషాలతో జీవించగలరని పాస్టర్లు విశ్వాసులకు తెలిపారు. వచ్చే నెల నుంచి జరుపుకునే ప్రీ, సెమీ, సపోజ్ క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొని క్రీస్తు జనన చిహ్న ఘడియకు ప్రార్థనలకు స్వాగతం పలకాలని తెలిపారు. కాగా నవంబర్ 25న సపోజ్ క్రిస్మస్‌ను పురస్కరించుకుని మందిరంల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, స్కిట్‌లు జరుపనున్నట్టు వారు తెలియజేశారు.

శానిటేషన్ డ్రైవ్ తనిఖీ

సిద్దవటం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆదివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా టక్కోలు, కడపాయపల్లె గ్రామాల్లో జరిగే పనులను ఆకస్మికంగా తనిఖీ చేశామని ఈఓపీఆర్‌డీ మెహతాబ్ యాస్మిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో నిల్వ ఉన్న అపరిశుభ్రతను తొలగించి ప్రజలకు ఎలాంటి అంటు వ్యాధులు సోకకుండా పారిశుధ్యం పనులు, బ్లీచింగ్ పిచికారీ చేయించామన్నారు. ఎవరైనా అలసత్వం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ దీపాలు నీటి సమస్యలు లేకుండా చూడాలని గ్రామ కార్యదర్శులకు ఆమె సూచించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు శివయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షార్చన



పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గురుస్వాములు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ మదిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అయ్యప్ప స్వామి లక్షార్చన మహోత్సవ కార్యక్రమాన్ని బీవీ రత్నం, రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, 7 గంటలకు మహాగణపతి పూజ, హోమం, 8.30 గంటలకు లక్షార్చన పూజ, 11 గంటలకు పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని అయ్యప్ప మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

చిట్వేలి : ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే దేశభక్తి కలిగి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎన్‌సీసీ అధికారులకు సూచించారు. ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ 30వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కడప కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. హవల్దార్ అరిస్టాటిల్ ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రపరిచి మొక్కలను నాటారు. పాఠశాల ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్ రాజు, ఎన్‌సీసి కేడెట్లు పాల్గొన్నారు.

కుండీలున్నా.. మొక్కలు లేవండి!



ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మొక్కలు లేక ఖాళీగా ఉన్న కుండీలు

రాజంపేట టౌన్ : రాజంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కుండీలున్నా మొక్కలు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. దాదాపు పదేళ్ల క్రితం అప్పటి ఆర్డీఓ వల్లూరు వీరబ్రహ్మం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు సాగించే వారికి మంచి అనుభూతి కల్పించాలన్న ఆలోచన చేశారు. అందులో భాగంగా ఓ ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా దాదాపు రెండు వందలకు పైగా కుండీలు ఏర్పాటు చేయించారు. తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి ఖరీదైన మొక్కలను తెప్పించి నాటించారు. అయితే కొంతమంది కక్కుర్తితో చాలా వరకు మొక్కలను దొంగలించుకుపోయారు. దీంతో ఓ ఇరవై మొక్కలు మాత్రమే మిగిలాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న కుండీల్లో గడ్డి మొలిచింది. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు మొక్కలు నాటిస్తే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కొత్త శోభ సంతరించుకుంటుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

ఐకమత్యంతోనే బలిజల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సుగవాసి సుబ్రమణ్యం

లక్కిరెడ్డిపల్లి : బలిజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని సుగవాసి సుబ్రమణ్యం, ప్రసాద్ బాబులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మర్రిచెట్టు సమీపంలోని దాసిరెడ్డి మిట్టన నవ్యాంధ్ర బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తిక మాస వనభోజన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బలిజల అభివృద్ధి ఐకమత్యంతోనే సాధ్యపడుతుందన్నారు. ఆర్థికంగా లేదా ఇతర కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారికి సంఘం తరపున సహకారం అందించాలన్నారు. అలానే చదువుకునే వారికి చేయూతనివ్వాలని, ప్రమాదాల బారిన పడి కుటుంబ పోషణ భారంగా ఉన్న వారికి బలిజ సంఘం తరపున అన్ని విధాల ఆదరించి అండగా నిలవాలన్నారు. రాజకీయ రంగంలో ఎదిగే వారికి సహాయ, సహకారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాధాకృష్ణ, నారాయణ, సుగవాసి శ్రీనివాసులు, మన్నూరు భాస్కర్, ఆంజనేయులు, తుపాకుల చంద్ర, మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, మ్మనూరు రాజశేఖర్, పసుపులేటి నాగేంద్ర, ఏనుగుల విశ్వనాథ్, మాజీ సర్పంచ్ రాజ, జనసేన నాయకురాలు రెడ్డి రాణి, రామా శ్రీనివాసులు, స్టూడియో ప్రసాద్, వాసు, బలిజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ



పెనగలూరు: పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వెలుగుపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజను వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి అతికారి సుబ్బరాయుడు అరటి బొద్దులతో అయ్యప్పస్వామి గుడిని నిర్మించి 18 మెట్లు ఏర్పాటు చేశారు. గుడిలో స్వామి వారి చిత్రపటాలను ఉంచి పూజ చేశారు.అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

పెనగలూరు : మండలంలోని చక్రంపేటలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హరికృష్ణ ఫ్రెండ్స్ స్టూడియో వారు ఏర్పాటు చేసిన ఈ పడిపూజ కార్యక్రమానికి ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం చక్రంపేట మాజీ సర్పంచ్ ధనుంజయ రెడ్డి, ఆరోగ్య పరిస్థితుల వల్ల ఇంటి వద్ద ఉండగా ఆకేపాటి ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితులు గురించి ఆరా తీశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

పీలేరురూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఏపీఎస్‌పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పోలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి.నరసయ్య అన్నారు. స్థానిక హుమయూన్ కల్యాణమండపంలో ఎంప్లాయీస్ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ భద్రతపై జారీ చేసిన సర్క్యులర్ నెంబర్ 01/2019ను ఆర్టీసీ ఉద్యోగులకు యథావిధిగా అమలు చేయాలన్నారు. 2022 నుంచి నిలిపివేసిన నైట్ అవుట్ డైలీ అలవెన్సు వెంటనే చెల్లించాలన్నారు. పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

హార్సిలీ హిల్స్‌లో డీవీఎం తనిఖీలు

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీ హిల్స్‌లో టూరిజం తిరుపతి డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. డీవీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి ఇక్కడికి వచ్చారు. కొండపై జరుగుతున్న టూరిజం కార్యకలాపాలను పరిశీలించారు. రెస్టారెంట్, బార్, అతిథి గృహాలను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. పర్యాటకుల సంఖ్య, ఆదాయం, అతిథిగృహాల బుకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఆధునీకరిస్తున్న అతిథి గృహం పనులను పరిశీలించారు. పర్యాటకులకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు పొంగుబాలు



అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద పొంగుబాలు పొంగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకారంలో ఎల్లమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బొజ్జవారిపల్లి వడ్డిపల్లిలో వెలసి ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి పొంగుబాలును ఆదివారం గ్రామస్తులు, మహిళలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఇంటిలో పూజలుచేసి మేళతాళాలతో గ్రామోత్సవంగా ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, పొంగుబాలు పొంగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ



దుకాణాదారులకు సూచనలిస్తున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

సుండుపల్లె : మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ పర్యటనలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులలో పేర్కొన్న సమస్యలపై ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బస్టాండ్ కూడలిలో ఉన్న కూరగాయల దుకాణాలను, పూల అంగళ్లను, తోపుడు బండ్లను రోడ్లపై పెట్టరాదని సూచించారు. అలా కాదని ఎవరైనా అంగళ్లను రోడ్డుపై పెడితే నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అనంతరం వారపు సంతను సందర్శించి చెత్తాచెదారాలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అగ్రహారంలో నిర్మాణ దశలో పెండింగ్‌లో ఉన్న కొత్త సచివాలయాన్ని పరిశీలించారు. మెయిన్ రోడ్డు నుండి ఇండోర్ స్టేడియం వరకు సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సచివాలయంలో ఇంటి పన్నుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ



సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ



లక్కిరెడ్డిపల్లి: గంగమ్మ తల్లి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేక పూజల జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దర్శనం కోసం ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనంకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులు భక్తులకు క్యూలైన్లు ద్వారా దర్శనాన్ని కల్పించారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసియున్న శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మొక్కులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు.